క్లుప్తంగా

బహిరంగ సభను జయప్రదం చేయండి

ఖమ్మంమామిళ్లగూడెం: నల్లగొండ జిల్లాలోని క్లాక్ టవర్ సెంటర్ మైదానంలో జేయూహెచ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని బీకేబజార్‌లోని జైనుల్ మస్జీద్ ఇమామ్ హఫీజ్ మహ్మద్ జవ్వాద్‌అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సభకు జేయూహెచ్ ఆల్‌ఇండియా అధ్యక్షుడు మౌలానా మహిముద్ అసద్ మదని ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు.

కరపత్రాలు పంపిణీ

తిరుమలాయపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు సురేశ్ తెలిపారు. మండలంలోని దమ్మాయిగూడెంలో కరపత్రాలను పంపిణీ చేసి నిరసన తెలిపారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు జీవనం సాగించలేని పరిస్థితి ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో తుల్లూరి నాగేశ్వరరావు, చామకూరి కోటయ్య, సతీశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చోడులో మావో వర్ధంతి

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం జడాంగ్ మావో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేశ్ మాట్లాడుతూ.. చైనా విప్లవంలో ప్రధాన పాత్ర పోషించి, సుదీర్ఘ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించి, చైనా విప్లవాన్ని విజయవంతం చేసిన మావో సిద్ధాంతాన్ని ఆచరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు గొర్రెపాటి వీరస్వామి, లక్ష్మణ్, రామ్మూర్తి, పుల్లయ్య, భగత్‌సింగ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు గృహలక్ష్మి అమలు చేయాలి

కూసుమంచి: అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి భూక్యా నర్సింహనాయక్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని గైగొళ్లపల్లి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల గడువు ముగిసినప్పటికీ ఇంతవరకు పథకం అమలు కాలేదన్నారు. వెంటనే అర్హులను గుర్తించి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. సమావేశంలో సంగబుత్తుల వెంకటరెడ్డి, జిల్లా లింగయ్య, ఉపేందర్‌రెడ్డి, పాండురంగాచారి, వెంకటేశ్వర్లు, శంకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరామయ్య సేవలు మరువలేనివి

ఖమ్మంరూరల్: వీర్ల వెంకటరామయ్య పార్టీకి చేసిన సేవలు మరువలేనివని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి శీలం సుదర్శన్ అన్నారు. శనివారం మండలంలోని కాచిరాజుగూడెంలో జరిగిన వెంకటరామయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. రైతు, కూలీల సమస్యల పరిష్కారం కోసం ఆయన ఎన్నో పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉమాశంకర్, గుడిచుట్టు గోపి, ఎం.ఉప్పలయ్య, తోట చిన్నఅప్పారావు, వీర్ల లింగయ్య, గోవర్ధన్, ఎం.మల్లయ్య, నాగేశ్వరరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో నిరసనలు

సాక్షి నెట్‌వర్క్: మాజీ సీఎం, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్టుపై ఆ పార్టీ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఖమ్మంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలపగా, నాయకులు వాసిరెడ్డి రామనాథం, నాగండ్ల మురళి, గుత్తా సీతయ్య, మందపల్లి రజిని, వడ్డేం విజయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామికమని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కమ్మ సంఘం నగర అధ్యక్షుడు వల్లభనేని రామారావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. ఇక కూసుమంచి, నేలకొండపల్లిల్లో జరిగిన ఆందోళనల్లో నాయకులు కొండబాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి విరాళం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులో ఉన్న శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మి, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి స్నేహ ఫుడ్స్ అధినేత జనగామ జగత్‌పాల్‌రావు – సుభాషిణి దంపతులు రూ.10,116 శనివారం విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఖుషి
వినోద	జవాన్(హిందీ), జైలర్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	ఓఎంజీ–2 (హిందీ)
శ్రీనివాస	జవాన్
సుందర్	తురుంఖాన్‌లు

– ఖమ్మంవ్యవసాయం

మారని బతుకులు..!



పాత మున్సిపాలిటీ ఎదుట పాత బట్టలు అమ్ముతున్న మహిళలు

76 ఏళ్లుగా పాతబట్టల అమ్మకమే జీవనాధారం

- 1947లో కర్ణాటక, మహారాష్ట్రల నుంచి రాక
- నేటికి నిస్సహాయ స్థితిలోనే..
- అందని ప్రభుత్వ ప్రోత్సాహకం

76 ఏళ్ల క్రితం వారాంతా పొట్ట చేతపట్టుకొని ఎన్నో ఆశలతో ఉపాధి కోసం ఖమ్మం వచ్చారు. ఎందరినో ఆదరించినట్టుగానే, మరెందరికో జీవితాన్ని ఇచ్చినట్లుగానే మాకు కూడా బతుకుమార్గం చూపిస్తుందని నమ్మి ఖమ్మానికి వచ్చారు. కానీ వారు కోరుకున్న బతుకు వారికి దక్కలేదు. పాత బట్టలు అమ్ముకుంటూ జీవిస్తున్న వారిని సమాజం కొత్తగా చూడలేదు. కనీసం వారికి ఉండటానికి గూడు, తినేందుకు తిండి కూడా సమకూరలేదు. అయినా ఆశ చంపుకోలేక ఆ పాత బట్టల అమ్మకమే జీవనాధారంగా బతుకు లీడుస్తున్న వారిపై కథనం.

నెరవేరని సొంతింటి కల

అరకొర వ్యాపారంతో ఎలాగోలా జీవితం నెట్టుకొస్తున్నా కనీసం ప్రభుత్వం నుంచి నామ మాత్రపు సాయం కూడా అందడం లేదని వారు వాపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తమ కంటే ఎంతో మంది తర్వాత వచ్చి వారికి ప్రభుత్వం సొంతింటి కల నెరవేర్చిందని, తాము ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల చదువులు, ఇంటి కిరాయిలు తదితరాలు భారంగా ఉన్నా.. ఎలా గోలా జీవనం సాగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్రూం అందించి సొంతింటికల నెరవేర్చాలని కోరుతున్నారు. రోడ్డు సైడ్ వ్యాపారం ఇబ్బందికరంగా ఉందని, వ్యాపారానికి అనువుగా ఏదైనా ప్రాంతంలో స్థలం కేటాయిస్తే అక్కడ తమ వ్యాపారం నిర్వహించుకుంటామని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నగరం కేవలం స్థానికులకే కాకుండా ఎన్నో భాషలు, కులాలు, మతాల వారికి ఉపాధి కేంద్రంగా కొనసాగుతోంది. రకరకాల వ్యాపారాలు, ఉద్యోగాలు, పనులు చేసుకునేందుకు నగరానికి వచ్చి స్థిరపడిన కుటుంబాలు వందల సంఖ్యలోనే ఉన్నాయి. కానీ 76 ఏళ్ల కిందట ఖమ్మంలో స్థిరపడేందుకు వచ్చిన కర్ణాటక, మహారాష్ట్రాల గొందిల జీవనంలో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. 1947లో కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి సుమారు 50 కుటుంబాలు ఇక్కడకు వలస వచ్చాయి. నాటి నుంచి నేటి వరకు ఇక్కడే స్థానికంగా ఉంటూ నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట, బొమ్మన సెంటర్‌లో పాత బట్టల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పురుషులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇల్లుల్లూ తిరిగి పాత బట్టలను సేకరించి, వాటికి ఇంతో అంతో చెల్లించి తీసుకొని రాగా.. వాటికి కొంత మొత్తంలో ధర పెంచి మహిళలు మార్కెట్‌లో అమ్ముతుంటారు.

ఇంటి కిరాయిలతో సతమతం..



ఇంటి కిరాయిలతో సతమతం అవుతున్నాం. నాకు ఇద్దరు ఆడపిల్లలు. భర్త చనిపోయి అయిదేళ్లయింది. డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఇంతవరకు ఇవ్వలేదు. మా వ్యాపారంతో జీవించడం కష్టంగా ఉంది. అధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలి.

– సంతోషి

వడ్డీలు కట్టలేకపోతున్నాం..

కొన్నేళ్లుగా పాత బట్టల వ్యాపారం చేయలేకపోతున్నాం. కొత్తబట్టలు సైతం ఈ మధ్యకాలంలో తక్కువ ధరలో అందుబాటులో ఉండటంతో కొనే వారు కరువయ్యారు. వడ్డీకి తెచ్చుకొని చేస్తున్నా.. ఈ వ్యాపారం ద్వారా కనీసం వడ్డీలు కూడా కట్టలేకపోతున్నాం. ప్రభుత్వం ఏదైనా ప్రోత్సాహం చూపాలి.

– రాణి

ఖమ్మం అభివృద్ధిపై బాధ్యతగా ఉన్నా..

- తాగునీరు, రహదారుల సమస్యలు పరిష్కరించా..
- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్



సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం అభివృద్ధిపై పట్టుదల, బాధ్యతగా ఉన్నందునే రూ.వేల కోట్ల నిధులు తీసుకొచ్చానని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. నగరంలోని 54వ డివిజన్ వీడీవోస్ కాలనీలో వైద్యులు శ్రీరాం ఆధ్వర్యాన శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. గతంలో ఇక్కడ ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, కష్టాలు చెప్పుకోవడానికి సరైన వ్యవస్థ ఉండేది కాదన్నారు. తాగునీటి సమస్య కూడా వేధించేదని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు ఇదే డివిజన్‌లో వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను నిర్మించగా.. ఫొటోను మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో చూపించారని తెలిపారు. అలాగే, ప్రతీ గల్లీకి సీసీ రోడ్డు నిర్మించడంతో పాటు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని చెప్పారు. ఇక కొత్త బస్టాండ్, ప్రతీ డివిజన్‌లో సుందరమైన పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, బల్లేపల్లి, కాల్వొడ్డులో వైకుంఠధామాలు నిర్మించినట్లు తెలిపారు. ఇక లకారం చెరువును అందంగా తీర్చిదిద్దామని మంత్రి వివరించారు. అభివృద్ధిని మధ్యలో ఆగకుండా, మరింత జరిగేలా వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో సాంబశివరెడ్డి, మద్దినేని వెంకటరమణ, కుతుంబాక బస్వానారాయణ, గరికపాటి వెంకటేశ్వరరావు, నెల్లూరి చంద్రయ్య, చేకూరి సత్యంబాబు, ఏపూరి మధుసూదన్, పోట్ల శ్రీకాంత్, డాక్టర్ మిక్కిలినేని విజయ్‌కుమార్, బత్తుల మురళి, సిరిపురపు సుదర్శన్ తదితరులు ఉన్నారు.

కేసీఆర్ పాలనపై నమ్మకం పోయింది..



ప్రజలతో మాట్లాడుతున్న ముమ్వా విజయ్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై ప్రజల్లో అపనమ్మకం పెరిగిందని, రోజురోజుకూ ఆ పార్టీ గ్రాఫ్ దిగజారుతోందని డీసీసీబీ మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మువ్వా విజయ్‌బాబు అన్నారు. గడపగడపకూ కాంగ్రెస్ ప్రచార కార్యక్రమాన్ని శనివారం 15, 46 డివిజన్లలో నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మలీదు జగన్, ఓబీసీ సెల్ నగర అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, మైనారిటీ నాయకులు షేక్ ఇమామ్, బోడా శ్రావణ్‌కుమార్, చల్లా రామకృష్ణారెడ్డి, కాంపాటి వెంకన్న, కీసర పద్మజారెడ్డి, కొంగర జ్యోతిర్మయి, శీతల హరినాథ్ పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు



ఖమ్మంమామిళ్లగూడెం: దరఖాస్తు సమర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉదయ్‌ప్రతాప్

ఖమ్మంరూరల్: పాలేరు అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి నకిరికంటి వీరభద్రం కోరారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.

బీజేపీ నాయకుల దరఖాస్తు

ఖమ్మంమామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్: ఖమ్మం, పాలేరు అసెంబ్లీ స్థానాలకు బీజేపీ నుంచి పోటీ చేసేందుకు శనివారం ఖమ్మానికి చెందిన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సన్నె ఉదయ్‌ప్రతాప్‌తో పాటు నాయకులు ధనియాకుల వెంకటనారాయణ యాదవ్, మట్టా దుర్గాప్రసాద్‌రెడ్డి, వీరభద్రం, నాగేశ్వరరావు, సుదర్శన్, రాజేశ్, పాపారావు, మధు, సాయిరాం, మహేందర్‌సింగ్, నర్సింహారావు, జ్వాలా నర్సింహారావు, రేఖ సత్యనారాయణ తదితరులు రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు.

నేడు పుస్తకావిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంకు చెందిన న్యూ ఇరా పాఠశాల పూర్వ విద్యార్థి, అమెరికాలో స్థిరపడిన ఇంజం నిషాంత్ రచించిన 'ది బెస్ట్ పాసిబుల్ ఎక్స్‌పీరియెన్స్' కథల పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నారు. ఉదయం 11 గంటలకు భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ కార్యక్రమం మొదలవుతుందని న్యూ ఇరా కరస్పాండెంట్ ఐవీ రమణారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం నగరం టౌన్–2 సెక్షన్ పరిధిలోని 11 కేవీ నెహ్రూనగర్ ఫీడర్ నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఆపరేషన్స్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూనగర్, వైరారోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

నేడు సర్వైశ్వర్య హోమం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరం ఎన్‌ఎస్‌పీ క్యాంపులోని రామగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీ మాతా అమృతానందమయి మఠం ఇన్‌చార్జ్ శ్రీ స్వామినిసువిద్యామృత ప్రాణ మాతాజీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు సర్వైశ్వర్య హోమం – దీప పూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కన్వీనర్ కూసంపూడి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సామగ్రి వేదిక వద్ద లభిస్తుందని వివరించారు.

స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దుతాం..



మాట్లాడుతున్న కన్వీనర్ సుచరిత

ఖమ్మంగాంధీచౌక్: పిల్లలను స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దడమే తెలుగు భాషాభ్యసన అభివృద్ధి వేదిక (లిఫ్) లక్ష్యమని కన్వీనర్ యలగందుల సుచరిత తెలిపారు. ప్రజాకవి కాళోజీ జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషాభ్యసన అభివృద్ధి వేదిక (లాంగ్వేజ్ ఇమ్‌ప్రూవ్‌మెంట్ ఫోరమ్ ఫర్ తెలుగు)ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం రిక్కాబజార్ పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన ఆవిర్భావ సమావేశంలో సుచరిత మాట్లాడారు.. వేదిక ఆధ్వర్యాన చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. సాహితీవేత్తలు పొత్తూరు సీతారామారావు, కన్నెగంటి వెంకటయ్య మాట్లాడగా తెలుగు ఉపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వర్లును సన్మానించారు. కార్యక్రమంలో షఫీ, సుజాత, కొండ్రు బ్రహ్మం, రాము, నాగేశ్వరరావు, దేవయ్య, వేదన, సీత పాల్గొన్నారు.

వర్గీకరణపై బీజేపీ స్పందించాలి..



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రాజన్న

నేలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణ అంశంపై బీజేపీ స్పందించాలని, లేనిపక్షంలో ఆ పార్టీ మాదిగలకు శత్రువుగా నిలుస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం చేపట్టిన నిరసన దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్న హామీ మేరకు త్వరలోనే జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లోనైనా బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయ కులు వడ్లమూడి వెంకటేశ్వర్లు, పోట్టపింజర బాలస్వామి, తోళ్ల వెంకన్న, పగిడిపల్లి బాబు, తోళ్ల సురేశ్, కుక్కల రవీందర్, వంగూరి వెంకన్న, హనుమంతు, మాదాసు వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

వారోత్సవాలను జయప్రదం చేయండి



అమరవీరులకు నివాళులర్పిస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు, పోటు ప్రసాద్, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వారోత్సవాల ప్రారంభ సూచికంగా అమరవీరులకు నివాళులర్పించాక ఆ యన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులు కాగా, వారి త్యాగాలతోనే నిజాం పాలన అంతమైందని తెలిపారు. కాగా, ఈనెల 11వ జరిగే సాయుధ పోరాట వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోటు ప్రసాద్, యర్రా బాబు, సిద్దినేని కర్ణకుమార్, మేకల శ్రీనివాసరావు, నార్ల వెంకటేశ్వరరావు, ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్ పాల్గొన్నారు.

ఆరెగూడెం గ్రామంలో వైద్యశిబిరం



ఆరెగూడెంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో జనం జ్వరాల బారిన పడుతున్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా సీజనల్ జ్వరాల బారిన పడుతుండగా ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. నేలకొండపల్లి ఆస్పత్రి ఓపీకి ప్రతిరోజు 200 మందికి పైగానే వస్తున్నారు. కాగా, మండలంలోని ఆరెగూడెంకు చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన జ్వరం రావడంతో స్వగ్రామానికి వస్తూ నేలకొండపల్లి పీహెచ్‌సీలో పరీక్ష చేయించుకోవడంతో డెంగీగా నిర్ధారణ అయింది. దీంతో గ్రామంలో శనివారం వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసి స్థానికులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే, ఎంపీడీఓ కె.జమలారెడ్డి గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. పంచాయతీ సర్పంచ్ దొనకొండ రామకృష్ణ, కార్యదర్శి కె.రామారావు, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ భాషాదినోత్సవం

తెలంగాణ పీడిత ప్రజల గొంతుకగా.. నిజాం పరిపాలనపై ధిక్కార స్వరం వినిపించిన మహాకవి కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ భాషాదినోత్సవంగా జరుపుకుంటున్నామని పలువురు వక్తలు పేర్కొన్నారు. కవిగా, రచయిగా ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని, చివరిశ్వాస వరకు నిరాండంబర జీవితాన్ని గడిపారని కొనియాడారు. ఆయన ఆశయసాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ ప్రైవేట్ విద్యాలయాలు, కార్యాలయాల్లో.. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

-సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఖమ్మంసహకారనగర్: న్యూవిజన్ పాఠశాలలో..



ఖమ్మంసహకారనగర్: రెజొనెన్స్ శ్రీనగర్‌లో..



ఖమ్మంసహకారనగర్: శ్రీచైతన్య ఒలింపియాడ్‌లో..



నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న గౌతమబుద్ధ చక్రవర్తి సొసైటీ బాధ్యులు



ఖమ్మంసహకారనగర్: త్రివేణి పాఠశాలలో..

పువ్వాడ ఉదయ్‌కు నివాళులు

రఘునాథపాలెం: మండలంలోని పువ్వాడ ఉదయ్‌నగర్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోదరుడు ఉదయ్‌కుమార్ జయంతిని శనివారం నిర్వహించారు. గ్రామ సెంటర్‌లోని ఉదయ్‌కుమార్ విగ్రహానికి సర్పంచ్ కంపాటి లలిత ఆధ్వర్యాన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లలిత మాట్లాడారు. నిరంతరం పేదల అభ్యున్నతి కోసమే ఉదయ్‌కుమార్ పాటుపడ్డారని, ఆయన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో తేళ్లూరి నరసింహారావు, సాదిక్‌పాషా, ఇస్మాయిల్, రాజు, బాబా, నర్సింహారావు, చింటు, వినోద, లోడుగు నాగమణి, నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి పాఠశాలకు అవార్డు



అవార్డు అందుకుంటున్న డైరెక్టర్ అరుణ్

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని గీతాంజలి పాఠశాలకు అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. ఈ విషయాన్ని కరస్పాండెంట్ టీవీ అప్పారావు, డైరెక్టర్లు టి.పద్మ, టి.అరుణ్ తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన గ్లోబల్ కే–12 ఎడ్యుకేషనల్ సమ్మిట్‌లో డైరెక్టర్ అరుణ్ అవార్డు అందుకున్నారని వెల్లడించారు. విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధిస్తుండటంతో అవార్డు లభించిందని తెలిపారు.